# జనసంద్రమైన భీమ్‌గల్

- పట్టణంలో నామినేషన్ కోలాహలం
- వేముల నామినేషన్ దాఖలు నేపథ్యంలో తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు
- వలగొడుగులు, బోనాలతో స్వాగతం
- యువకుల భారీ బైక్ ర్యాలీ
- పలు ఆలయాల్లో వేముల ప్రశాంత్‌రెడ్డి దంపతుల ప్రత్యేక పూజలు


భీమ్‌గల్‌లో మంత్రి వేములకు బోనాలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

భీమ్‌గల్, నవంబర్ 6 : భీమ్‌గల్ పట్టణం గులాబీ మయమైంది. బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్ రెడ్డి సోమవారం నామినేషన్ వేసిన సందర్భంగా నియోజకవర్గంలోని నలుమూలల నుంచి స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళలు మంగళహారతులు, వలగొడుగులు, బోనాలు, రైతులు, యువకులు బైక్ ర్యాలీ ద్వారా స్వాగతం పలికారు. ర్యాలీ సుభాష్ నగర్ నుంచి బోదిరే గల్లీ, అంగన్‌వాడీ బజార్, నందిగల్లి, హరిజనవాడ మీదుగా ముచ్కూర్ చౌరస్తా వరకు సాగింది. ర్యాలీలో గులాబీల జెండలే పాటపై డ్యాన్సులు చేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ఫ్యామిలీ అండ్ హెల్త్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ డి.రాజేశ్వర్, డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నే ప్రేమలత పాల్గొన్నారు.

**వేముల ప్రత్యేక పూజలు**

వేల్పూర్, నవంబర్ 6: భీమ్‌గల్‌లో నామినేషన్ దాఖలు చేయడానికి వెళ్తున్న సందర్భంగా వేల్పూర్ మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయం, రామాలయంలో వేముల ప్రశాంత్‌రెడ్డి, సతీమణి నీరజారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. భీమ్‌గల్ పట్టణంలో నామినేషన్ వేసిన తర్వాత వేముల భారీ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం వేముల దంపతులు లింబాద్రి గుట్టపై లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు పూజలు నిర్వహించి స్వామివారి శేష వస్త్రం అందజేశారు. అనంతరం కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి కోటిలింగేశ్వర ఆలయంలో పూజలు చేశారు.


వేల్పూర్‌లోని పెద్దమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న వేముల దంపతులు

**వేముల ఎన్నికల ప్రచార షెడ్యూల్**

వేల్పూర్, నవంబర్ 6 : బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఉదయం 8.30 గంటలకు వేల్పూర్ మండలం కుకునూర్, 10.30 గంటలకు కోమన్‌పల్లి, 11.30 గంటలకు వెంకటాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. సాయంత్రం 4 గంటలకు భీమ్‌గల్ మండలం బాబానగర్, 6 గంటలకు బాబాపూర్, 7 గంటలకు పురాణీపేట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు.


మెండోరా నుంచి బయల్దేరి వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు


బాల్కొండ నుంచి ..


ఏర్గట్ల నుంచి భీమ్‌గల్‌కు తరలివెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

## నామినేషన్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు



భీమ్‌గల్ పట్టణంలో నామినేషన్ కేంద్రం వద్ద సోమవారం పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఏసీపీ జగదీశ్ చంద్ర ఆధ్వర్యంలో 50 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు.

–భీమ్‌గల్, నవంబర్ 6

## శెట్‌పల్లిలో కంటి వైద్యశిబిరం


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

మోర్తాడ్, నవంబర్ 6: మండలంలోని శెట్‌పల్లి గ్రామంలో కరుణట్రస్ట్, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 40మందికి కంటిపరీక్షలు నిర్వహించి, ఎనిమిది మందికి ఉచితంగా ఆపరేషన్‌కు రిఫర్ చేసినట్లు డాక్టర్ ప్రసాద్ తెలిపారు. భవిష్యత్తులో ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని వైద్యశిబిరాలు నిర్వహిస్తామని కరుణ ట్రస్ట్ చైర్మన్ మహేశ్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్దంగం గారెడ్డి, ట్రస్ట్ సభ్యులు రాజేశ్, బాలాజీ, సిద్దార్థ్, కార్తీక్, వినీల్, విశాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## సుంకెట్ ఉన్నత పాఠశాల బాలికల జట్టుకు గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్ సాధించిన బాలికల జట్టు

మోర్తాడ్, నవంబర్ 6: వరంగల్‌లో రూరల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బాలికల విభాగం (అండర్ –14)లో కబడ్డీలో సుంకెట్ ఉన్నతపాఠశాలకు చెందిన జట్టు గోల్డ్‌మెడల్ సాధించింది. గోల్డ్‌మెడల్ సాధించిన బాలికల జట్టుకు, సహకరించిన ఉపాధ్యాయురాలు పుష్పకు, సర్పంచ్ శ్రీనివాస్, హెచ్‌ఎం సంతోష్‌కుమార్, ఎస్‌ఎంసీ చైర్మన్ ప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థినులను అభినందించారు.

## ‘పది’ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు


కమ్మర్‌పల్లిలో విద్యార్థులకు కొనసాగుతున్న ప్రత్యేక తరగతులు

కమ్మర్‌పల్లి, నవంబర్ 6 : రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ ఆదేశాల మేరకు పదో తరగతి చదువుతున్న బాలబాలికలకు ప్రతిరోజు సాయంత్రం ప్రత్యేక తరగతులను సోమవారం ప్రారంభించినట్లు ప్రధానోపాధ్యాయుడు పి.సాయన్న తెలిపారు. ప్రత్యేక తరగతుల ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో ‘తొలిమెట్టు’

### ప్రారంభించిన ప్రిన్సిపాల్ సతీశ్

భీమ్‌గల్, నవంబర్ 6: విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు తొలిమెట్టు కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సతీశ్ అన్నారు. సోమవారం కళాశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో తొలిమెట్టు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఐదో తరగతి వరకు విద్యార్థుల డ్రాపవుట్స్ తగ్గించేందుకు తొలిమెట్టు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎన్‌సీసీ కో–ఆర్డినేటర్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.


తొలిమెట్టు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు